మనస్పర్థ

రామా చంద్రమౌళి



సుధాకర్‌కు ఎంతో సంతోషంగా ఉంది.

ఆఫీస్ అయిపోగానే ఎంతో హుషారుగా బయలుదేరి, తోవలో మల్లెపూల చెండు కొనుక్కొని యింటిదగ్గర తనకోసం ఎదురుచూస్తూ ఉండే భార్యను ఊహించుకుంటూ వడివడిగా నడుస్తున్నాడు.

పైన మేఘాలు అరుస్తున్నాయి. కొద్దిగా గాలిదుమారం కూడా లేస్తోంది. ప్రకృతి మసకపట్టిన అద్దంలా తయారైంది.

సుధాకర్ అవేవీ పట్టించుకునే స్థితిలో లేడు. ఆ రోజే అతని రెండు వేల రూపాయల ఎరియర్స్ వచ్చాయి. వాటితోపాటు జీతంకూడా వచ్చింది.

జేబులోనుండి ఉత్సాహం అతని గుండెల దాకా ప్రవహిస్తోంది.

రెండువేల ఐదువందలకు సరిపడే ప్లాన్స్, ప్రపోజల్స్, బ్లూప్రింట్లూ, ట్రూకాపీలతో సహా అతని బుర్రలో గిరగిరా తిరిగి బహు మారాం చేస్తు న్నాయి...స్టీల్‌బీరువా ... ఓ సోఫా... ఓ నాల్గు చీరలు ... తనకో నాల్గు పాంట్లూ, షర్ట్స్ ... యింకో గ్యాస్ స్టవ్—యింకా ఎన్నో ... ఎన్నో ... ఎన్నెన్నో—

యింటి గుమ్మంలో కొచ్చిన సుధాకర్‌కు లక్ష్మి ఎదురురాలేదు నవ్వుతూ.

గుండుసూది గుచ్చుకున్న గాలి బుడగలా అయిపోయాడు.

"లక్ష్మి ... లక్ష్మి —" అని పిలిచాడు.

ఊహుఁ...జవాబు లేదు.

ఏంజేస్తున్నట్టూ లోపల ... రోజూ తను యింట్లోకి అడుగుపెట్టగానే కిలా కిలా పసిపిల్లలా నవ్వుతూ ఎదురొచ్చి పలకరించే లక్ష్మి ... యివ్వాళ ..., ప్చ్—

చేతిలోని పూలపొట్లాన్ని టేబుల్‌పై పెట్టి చొక్కావిడుస్తూ ప్రక్కగదిలోకి చూశాడు సుధాకర్.

పడకగదిలో టేబుల్ ముందర కూర్చుని లైటు వెలుగులో ఏదో రాసు కుంటోంది లక్ష్మి సీరియస్‌గా.

యింత తీవ్రంగా ఏం రాస్తోందబ్బా. దేన్నీ పట్టించుకోకుండా ఏకధాటిగా రాసేందుకు లక్ష్మి ఓ రచయిత్రయినా కాదుగదా—మరి...

మెల్లగా ... పిల్లిలా ... చప్పుడు చేయకుండా నడిచి ... ఆమె వెనుకగా చేరి...

ప్చ్... లక్ష్మి తనను గమనించినట్టే లేదు ... ఏమిటీ నిమగ్నత ... తనను కూడా పట్టించుకోకుండా ఏమిటా రాత.

వెలుగులో రాసుకుంటున్న లక్ష్మి కాంతివర్షంలో మెరిసిపోతున్న సరస్వతిలా ఉంది.

ఆమె భుజాలపైనుండి చూస్తూంటే—

డియర్ రామం,

మన మధ్య ఈ ఉత్తరాలతో నా దాహం తీరడంలేదు. నేను యింక ఎంత కాలం మా వారికి తెలియకుండా నీకిలా ఉత్తరాలు రాయను చెప్పు. నువ్వు ప్రతి రోజూ రాస్తున్న ఒక్కో ఉత్తరం నాలో కోటి వసంతాలను పూయిస్తోంది. నిజంగా నాపై నీకున్న ప్రేమ ... అనురాగం ... అభిమానం అసామాన్య మైనవి. నీతో యీ రకంగా యీ మధు రానుభూతిని పంచుకోగలిగే అదృష్టం నాకు కలిగినందుకు నేనెంత గర్విస్తు న్నానో తెలుసా. నిజంగా మనది ఎన్నెన్నో జన్మల బంధం. ఏ అనుబంధమో మన యిద్దరినీ యిలా కలిపింది.

కాని ... యింకా యీ ఎడబాటును నేను సహించలేను. నాకు యీ భర్తా, యీ యిల్లూ, యీ సంసారం ... యీ ఆస్తిపాస్తులూ ... అసలీ ప్రపంచమే వద్దు. నువ్వే కావాలి. నీ సన్నిధి నాకు అంతులేని పెన్నిధి. యీ ఉత్తరాలతో మన నడుమ యింకా కాలాన్ని వృధా చేయడం నాకిష్టం లేదు. నన్ను నీతో తీసుకుపో. ప్లీజ్. నా వేదననూ, నా తపననూ అర్థంచేసుకో. నా మనసంతా నువ్వే నిండి ఎటు చూచినా నీ రూపమే కనబడుతోంది నాకు. నా తనువులోని అణువణువునా నువ్వే స్పందిస్తున్నావు. నేనింకా ఎంతోకాలం ఈ విరహాన్ని భరించలేను.

అసలు...మన నడుమ పవిత్రమైన వివాహబంధం నెలకొనవలసింది ... మన దురదృష్టవశాత్తు, తప్పిపోయి... యిక్కడ యీయనతో మనసులేని మనువాడి...యీ నాలుగేండ్లలో నేనెంత నరకాన్ననుభవించానో నీకు తెలియదు ... అయినా ఫర్వాలేదు ... యిప్పుడు నువ్వొచ్చావు.

నా గుండె గుడిలో నేను ప్రతిష్ఠించుకున్న నీ రూపు యింకా పవిత్రంగా ఉంది. రాత్రింబవళ్ళూ నీ ఆరాధనలోనే జీవిస్తున్న నన్ను యింకా ఆలస్యం చేయకుండా నీ వెంట తీసుకుపోరాదూ...ప్లీజ్—

యింకా రాస్తోంది.

సుధాకర్ తలలో కోటి డైనమైట్లు ప్రేలాయి.

"యూ డర్టీ! బ్రూట్—" అరిచాడు బిగ్గరగా.

లక్ష్మి వెనక్కి తిరిగి ఎంతో మామూలుగా అతనివంక చూచి "ఎంత సేపైంది వచ్చి?" అంది ఎంతో నెమ్మదిగా.

"అదంతా నీ కనవసరం...నిన్నూ ...నిన్నూ—"

మనిషి పశువుకన్నా క్రూరంగా, వికారంగా తయారౌతున్నాడు. కళ్ళు నిప్పులై పిడికిళ్ళు బిగుసుకుపోతున్నాయి.

"ఎందుకంతగా ఆవేశపడుతున్నారు."

"ఎందుకా...తూ ...నువ్వో బజారు ముండవి. నిన్ను యీ నాలుగేళ్ళూ దేవతలా పూజించాను గదే. నిర్మలంగా, నంగనాచిలా నవ్వే నిన్ను చూచి నువ్వు పసిపాపలాటి అమాయకురాలవనుకున్నాను యిన్నాళ్ళూ. కాని—యిప్పుడు నిన్నూ, నీ నిజస్వరూపాన్నీ చూస్తూంటే ... యిలాగే పిచ్చికుక్కను కాల్చినట్టు కాల్చేయా లనిపిస్తోంది ... చెప్పు ... ఎవడు వాడు ... ఎన్నాళ్ళనుండి సాగుతోందీ నాటకం ... చెప్పు—" గర్జించాడు.

"......"

"మాట్లాడవేం—" ఆమె చేతిలోని

కాగితాన్ని లాక్కుని... "యింకా యీ విరహాన్ని భరించలేవా ... యింకా యీ ఎడబాటును సహించలేవా ... ఛీ...లజ్జ ... సిగ్గు లేదూ ... పెళ్ళిచేసుకుని కాపురం చేసుకుంటున్నదానివి యింత బరితెగించి...నిన్నూ ... నిన్నూ—"

లక్ష్మి చెంపలను యిష్టమొచ్చినంత సేపు వాయించాడు. చేతిలోని కాగితాన్ని ముక్కలు ముక్కలుగా చింపి నేలకేసి కొట్టి...మళ్ళీ ఆమె భుజాలను పట్టుకుని కుదిపి ... తలను గోడకేసి బాది ... కసితో, కోపంతో ఊగిపోతూ—

"నీకేం తక్కువయింది ... నేను ప్రేమగా చూచుకోలేదా...నిన్ను నిరాదరణగా చూశానా... నా గుండెల్లో పెట్టుకుని పూజించానే...నువ్వే నా జీవితమనీ ...నీ తోడిదే స్వర్గమని భావించానే. నువ్వు కావాలన్నవన్నీ యిచ్చి ... నీ యిష్టాలన్నీ తీర్చి ... ఏం తక్కువైంది నీకు — చెప్పు ... చెప్పవేమిచే డర్టీ రోగ్..."

"......"

"పోనీ ... నిన్ను యిల్లు వదలనీయకుండా బందీనైనా చేయలేదుగదా. నీకు కావాల్సినంత స్వేచ్ఛనిచ్చాను. నీ సంస్కారాన్ని ఎంతో గొప్పగా అర్థంచేసుకుని నీకు స్వతంత్రాన్నిచ్చాను ... అందుకు నువ్వు నా కిచ్చిన ప్రతిఫలం యిదా...ఐ కాంట్ టాలరేట్... రాక్షసీ...యూ గెటౌట్..."

"......"

"ఏడుస్తున్నావా యింకా సిగ్గులేక... ఛీ ... యిప్పుడు నిన్ను చూస్తుంటే నాపై నాకే అసహ్యమేస్తోంది. యీ నాలుగేళ్ళూ నీతో సంసారం చేసినానని తెలిసి...ఆనాటినుండీ ఏ పిశాచంతోనో కాపురంచేసినట్టు ఫీలౌతున్నాను ... నువ్వింకా నా ముందుంటే నేనేం జేస్తానో నాకే తెలియడంలేదు. నేను నిన్నింకా హత్య చేయకముందే యీ యింట్లోనుండి వెళ్ళిపో ...పో—"

"......"

"గెటౌట్ ..." యిల్లంతా ధ్వనించింది గదిలో బాంబు ప్రేలినట్టు.

గబగబా వెళ్ళి ఓ సూట్‌కేస్‌ను తెచ్చి ఆమె ఎదురుగా నేలపై విసిరికొట్టి ఎదురుగా దండెంమీది ఆమె తాలూకు చీరలూ, బట్టలూ ఆమె ముఖంపై విసిరేసి..."కమాన్...వెళ్ళిపో ... నా కిక ఎన్నడూ నీ ముఖం చూపించకుండా... తక్షణం నా ముందటినుండి పో ... యింకో క్షణమాలస్యమైతే నేనింకా పిచ్చాన్నయి నిన్ను కండలు కండలుగా కోసేస్తాను...ఉఁ..."

"......"

ఆమె మాట్లాడలేదు. నిశ్శబ్దంగా ఏడుస్తోంది.

బయట ఆకాశం బ్రద్దలైపోతున్నట్టుగా ఉరుములు...వానకూడా కురుస్తున్నట్టున్నది. చీకటిపడి కిటికీలోనుండి

ప్రపంచం నల్లగా ... ఎలుగుబంటు తోలులా భయంకరంగా కనిపిస్తోంది.

సుధాకర్ వంగి గబగబా సూట్ కేస్‌లో క్రిందపడిఉన్న బట్టలను కుక్కి సూట్ కేస్‌ను బలవంతంగా ఆమె చేతిలో పెట్టి మెడబట్టి బయటికి— వీధిగుమ్మం అవతలకు నెట్టేసి లోపలికొచ్చాడు.

ఉరుములు... మెరుపులు... వాన... అతని మనసులో — ఆమె మనసులో.

గదిలో లైటు వేసుకోలే దతను... చీకట్లో కూర్చుని ఉండిపోయాడు.

కన్నుల్లో...గదిలో ... బయటా... లోపలా—అంతా చీకటి...చీకటి.

గతం తాలూకు జ్ఞాపకాలు సముద్రంలా పొంగి ... అనుభవాలు పగిలిన శిల్పాల్లా వెక్కిరించి...నిజం దయ్యంలా ఎదుట నిలబడి నవ్వుతూంటే...

ఆలోచనల వాననుండి తేరుకుని— టైం చూసుకున్నాడు సుధాకర్.

తొమ్మిదైంది.

అప్రయత్నంగానే వీధిగుమ్మం తెరిచి చూశాడు.

అప్పటినుండీ వానలో తడుస్తూ... అరుగుపై నిలబడి ... సూట్ కేస్‌తో— లక్ష్మి...లక్ష్మి...లక్ష్మి.

లక్ష్మి యింకా అలాగే ఉంది.

యింటి యజమాని కసరికొడు తూంటే దీనంగా, నిస్సహాయంగా చూస్తూన్న బిచ్చపుదానిలా ... చూస్తూ ఆమె—

అతను ఆమె దిక్కు బిగ్గరగా ఉమ్మేశాడు తుపుక్కున ... కసిగా... అసహ్యంగా.

లక్ష్మి మళ్ళీ ఓసారి అతని దిక్కు చూచి నడిచింది వానలోకి...చీకట్లోకి.

* * *

"ఛీ ఛీ...ఎందుకు తన జీవితమిలా నరకమైపోయింది ... తనేం పాపం చేశాడని తనకు బ్రతుకిలా శాపంలా పరిణమించింది ... ఓహ్ ... యీవాళ యీ జీవితాన్ని వ్యధతో... బాధతో... మధనంలో కుమిలి...కుమిలి ... అటు లక్ష్మి ... ఆ తర్వాత యిటు యీ జానకీ...తనను జలగల్లా హింసించి... అబ్బా ... గతం ఓ ముళ్ళపొదలో పొర్లాటలా వికారంగా ... జుగుప్సాకరంగా — నో నో ... తనీ బాధను భరించలేడు ... యింకా యీ జ్ఞాపకాల నిప్పుల వానలో తడువలేడు ... నో నో నో...బెడ్‌పై బిగ్గరగా అరుస్తున్నాడు సుధాకర్. అరుస్తూ బాధగా పొర్లుతున్నాడు మంచంపై. కడుపులో నొప్పి ... గుండెల్లోనొప్పి ... తలలో నొప్పి...

అతని అరుపులను వినేవారెవరూ లేరు యింట్లో...అంతా నిశ్శబ్దం.

దిక్కు లేదు.

కనీసం పరామర్శించే మనుషులూ లేరు.

బాధగా మూల్గి ఒత్తిగిలి పడుకున్నాడు.

మళ్ళీ ఆలోచనలు కుమ్మరి పురుగులా తొలుస్తున్నాయి మెదడును.

లక్ష్మి తననుండి వెళ్ళిపోయింతర్వాత ... ఆమెపై అసహ్యంతో, కసితో, ద్వేషంతో, ఆవేశంతో — తను మరో పెళ్ళి చేసుకున్నాడు, జానకిని.

మళ్ళీ క్రొత్త జీవితాన్నారంభిద్దామనుకున్నాడు.

జానకికి షోకు లెక్కువ. ఖర్చు లెక్కువ. వజ్రాలపై మక్కువ లెక్కువ. వయ్యారా లెక్కువ.

తన ఆరోగ్యం, ఉద్యోగం సరిగ్గా ఉన్నంతకాలం ఎంతో అణకువగా ఉంది. కాని ఆరోగ్యం చెడి, దాంతో ఉద్యోగం ఊడి ... తను జారిపోవడం ప్రారంభించాక ... ఆమె వలస పక్షిలా ...తనను నిర్లక్ష్యంచేసి... విడిచి పెట్టినట్టుగానే విచ్చలవిడిగా ...యిష్టమున్న విధంగా, యిష్టమున్నప్పుడు యిల్లు వదలి ... రాత్రింబవళ్లు తేడా లేదు. తనపై ధ్యాసలేదు ... ఎవరికివారే యమునా తీరే...ప్చ్—

లక్ష్మి తననుండి దూరమై ఒట్టి వికారమైన జ్ఞాపకాలనే మిగిల్చింది. కాని జానకి...ప్రత్యక్షంగానే నరకాన్ని చూపిస్తోంది తనకు.

ఓహ్—యీ దారిద్ర్యాన్ని ...యీ నిరాదరణనూ ... యీ కూలిపోయిన జీవితాన్ని తనింకా భరించలేడు... భరించలేడు.

మెల్లగా లేచి బయటి అరుగుదాకా వచ్చాడు.

వీధిలో ఎండ మండిపోతోంది.

దాహం ... దాహం ... ఆకలి ... ఆకలి ... కాని ఎవరు తీరుస్తారు వాటిని.

దుఃఖం ముంచుకొచ్చి ముఖాన్ని దోసిలిలో కప్పుకున్నాడు ... ముఖం నిండా ముడుతలు... యీ పదేండ్లలోనే ఎంత మారిపోయాడు తను.

జానకి ఎక్కడికిపోయిందో—ప్చ్.

"పోస్ట్—"

తలెత్తాడు సుధాకర్.

కవరందించాడు పోస్ట్‌మాన్.

తనకు ఉత్తర మెక్కడినుండొస్తుంది.

చించాడు.

క్రాస్డ్ చెక్ ఉంది ఓ ఐదువేల రూపాయలకు.

కళ్ళు చికిలించి చూశాడు మళ్ళీ ... సందేహం లేదు. తన పేరనే ఉంది చెక్కు. కలకత్తాలోని సెంట్రల్ బ్యాంకాఫ్ ఇండియాలోని అకౌంట్‌నుండి డ్రా అయింది.

కలకత్తాలో ఎవరున్నారు తనకు... యీ నికృష్ట స్థితిలో తనను ఆదుకునే ఆ దేవుడులాంటి మనిషి ఎవరు.

చెక్కుకు పిన్‌చేసి ఉన్న ఉత్తరాన్ని విప్పాడు.

శ్రీ సుధాకర్ గార్కి,

నమస్తే,

నే నెవరోనని ఆశ్చర్యపోతున్నారు గదూ—

నేనండీ—లక్ష్మిని.

మీతో దూషించబడి, పతితనై మీ యింట్లోనుండి గెంటివేయబడ్డ లక్ష్మి నండీ—

ఆనాడు ... మీతో యింట్లోనుండి వెళ్లగొట్టబడ్డ రోజున ... ఏమయిందో తెలుసా.

...అంతకుముందే నాకు కాళ్ళ వ్రేళ్ళూ, చేతులూ మంటగా, దురదగా ఉండేవి. ఓసారి మన యింటి ప్రక్క లక్ష్మమ్మ దవాఖానాకు వెళుతూంటే నేనూ తోడుగా వెళ్ళి నేను కూడా డాక్టర్‌కు చూపించుకున్నాను.

అతను నన్ను రహస్యంగా పిలిచి ఓ భయంకరమైన విషయం చెప్పాడు.

ఆ తర్వాత—మళ్ళీ ఓసారి మీకు తెలియకుండానే థరో చెకప్ చేయించుకున్నాను. నేను అనుకున్నది నిజమే అయింది...అతను చెప్పిందేమిటంటే— నాకు కుష్ఠు.

కుష్ఠు అంటువ్యాధి...నేను పతనమైపోతూ ... దేవుడులాంటి మిమ్మల్ని కూడా పతనంవైపు లాక్కుపోతూ ... నో — నా మూలంగా మీరు నాశనమయ్యేందుకు వీల్లేదు. నేను మీనుండి దూరమైపోవాలి. మిమ్మల్ని నా నుండీ, నా రోగంనుండీ రక్షించాలి... ఎలా... ఎలా.

ఆలోచించాను...ఆలోచించాను.

ఫలితం ఆనాటి ఆ ఘర్షణ ... ఆ తుఫాను.

ఆ వానలో ... ఆ చీకట్లో మీనుండి దూరమై...పగిలిన గుండెలతో కలకత్తా వచ్చాను. వచ్చి మథర్ తెరీసా హోమ్‌లో...

కాని ... యిప్పుడు నాకిక జీవితం అయిపో వచ్చింది. బహుశా యీ ఉత్తరం మీకు చేరేవరకు నేనింకా భూమ్మీద ఉండను.

దీంతో జతపరిచిన ఐదువేల రూపాయల్లో యిన్నాళ్ల శ్రమ ఉంది. హృదయం ఉంది. సహృదయతతో స్వీకరించి నాకు ఆత్మశాంతి చేకూరుస్తా రని ఆకాంక్షిస్తూ—సెలవు.

నీ

లక్ష్మి.

సుధాకర్ కళ్ళలోనుండి వెచ్చగా కన్నీటిధారలు కారుతున్నాయి.